ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 7 సెప్టెంబరు 2025

రెండో రోజు కొనసాగిన గణనాథుల నిమజ్జనాలు



అప్పన్నపేట చెరువులో నిమజ్జనం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుల నిమజ్జనాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. అప్పన్నపేట, కనగర్తి, కాపులపల్లి, తుర్కలమద్దికుంట, నిట్టూరు గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో గణనాథుల శోభాయాత్రను నిర్వహించి గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావద్దు



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డ్రగ్స్ బాధితుల కోసం వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ బాధితుల కోసం ప్రతీ శనివారం కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. యువకులు డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ మాట్లాడుతూ డ్రగ్స్ బాధితులను ఆరోగ్యవంతులుగా తయారుచేస్తామని, సైక్రియాలజిస్ట్ రవివర్మ ఆధ్వర్యంలో బాధితులకు ట్రీట్‌మెంట్ ఇస్తామన్నారు. లీగల్ సర్వీస్ కార్యదర్శి స్వప్నరాణి, వైద్యులు అప్పారావు, న్యాయవాదులు ముచ్చకుర్తి కుమార్, అంజలి పాల్గొన్నారు.

నేటి నుంచి రాకపోకలు నిలిపివేత

ఓదెల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 31వ రైల్వే గేట్ వద్ద ఆదివారం నుంచి వారం రోజులపాటు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పెద్దపల్లి రైల్వే సెక్షన్స్ సీనియర్ ఇంజనీర్ శంబుదయాల్ మీనా ఆదేశాలు జారీ చేశారు. రైల్వే గేటులో లైన్ల మరమ్మతు పనులు నిర్వహిస్తున్నామన్నారు. తిరిగి 13వ తేదీ నుంచి వాహనాల రాకపోకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రజలు, వాహనదారులు సహకరించాలని సీనియర్ ఇంజనీర్ పేర్కొన్నారు.

మైక్రో బ్రూవరీలకు దరఖాస్తు చేసుకోండి

కోల్‌సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో మైక్రో బ్రూవరీల బీర్ల తయారీ యూనిట్ నెలకొల్పడానికి దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మహిపాల్‌రెడ్డి తెలిపారు. లక్ష చలాన్‌తోపాటు ఎంబీ-1ఏ దరఖాస్తు ఫారం, స్వీయ ధ్రువీకరణ పత్రం (ఆధార్, పాన్‌కార్డ్), సంస్థ రిజిస్ట్రేషన్ కాపీ, లైసెన్స్ ప్రతులతో ఈనెల 25వ తేదీలోపు కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ రాజేశ్వర్



ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపునకు యాప్

- లబ్ధిదారులకే ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం
- ఈ నెల 4వ తేదీన అమల్లోకి వచ్చిన యాప్
- సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నం.18005995991

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు, అవినీతిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో లబ్ధిదారులే ఫొటోలు అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ విధానం ఈనెల 4వ తేదీ నుంచే అమలులోకి వచ్చింది. అలాగే ఇళ్లకు సంబంధించి, బిల్లుల చెల్లింపునకు ఎవ రైనా డబ్బులు కావాలని వేధింపులకు గురిచేస్తే ఫిర్యా దు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 18005995991ను గృహ నిర్మాణశాఖ అందుబాటు లోకి తీసుకవచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇం దిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని అందుబాటులోకి తీసు కువచ్చిన విషయం తెలిసిందే. ప్రతీ అసెంబ్లీ నియో జకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా, జిల్లాకు 9421 ఇళ్లు మంజూరు చేశారు. అందులో 5,986 ఇళ్లకు లబ్ధి దారులను ఎంపిక చేశారు. 4,048 ఇళ్లకు ముగ్గులు పోశారు. 1,505 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో, 200 ఇళ్ల గోడల వరకు, శ్లాబ్ స్థాయి వరకు 220 ఇళ్లు, నాలుగు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, 1,929 ఇళ్ల పనులు ప్రగ తిలో ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు, ఇంతవరకు చేసిన చెల్లింపులు, తదితర సమాచార మంతా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. బిల్లు ఎక్కడ ఉంది, ఏ తేదీన, ఎంత మొత్తం ఏ బ్యాంక్ అకౌంట్‌లో జమ తదితర వివరాలు పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తీసుకవచ్చారు. దీంతో లబ్ధిదారులు గ్రామస్థాయి నుంచి మండలస్థాయి అధికారులు, సిబ్బంది చుట్టూ తిరగా ల్సిన అవసరం లేదు. పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, మండల స్థాయిల్లో ఉద్దేశ పూర్వక జాప్య నివారణకు, అక్క డక్కడా జరుగుతున్న అవినీతిని అరికట్టడానికి ఇందిరమ్మ యాప్‌ను తీసుకవచ్చారు. బిల్లుల కోసం స్వ యంగా ఫొటోలు తీసుకుని అప్‌లోడ్ చేసే విధంగా యాప్‌ను ఆధునీకరించారు. ఈ నెల 4వ తేదీ నుంచి దానిని అందుబాటులోకి తీసుకవచ్చారని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజేశ్వర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అప్‌లోడ్ విధానం ఇలా...

మొదట మొబైల్ ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత లబ్ధిదారుడి లాగిన్ లో మొబైల్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసిన తర్వాత డ్యాష్ బోర్డులో లబ్ధిదా రుడి పేరు, మొబైల్ నంబరు తదితర వివరాలతో పాటు ఫొటోలు తీయడం (క్యాప్చర్ ఫొటోగ్రాఫ్) అనే వాటి కింద ఇళ్ల నిర్మాణపు దశలు (గ్రౌండింగ్, బేస్ మెంట్, వాలింగ్, స్లాబ్, నిర్మాణం పూర్తి) అని కనిపిస్తాయి.

- లబ్ధిదారులు గ్రౌండింగ్ స్థాయి ఫొటోలు అప్‌లోడ్ చేయాలనుకుంటే గ్రౌండింగ్ క్లిక్ చేస్తే దరఖాస్తుదారుడికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. లబ్ధిదా రులు ప్రతిపాదిత ఇంటి నిర్మాణ స్థలం నుంచే మొబైల్ ఫోన్‌లోని కెమెరాతో ఫొటోలు తీయాలి. ఇక్కడే కెమె రాలో జియో ట్యాగింగ్ నిమిత్తం మ్యాప్ సింబల్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి, ఒకసారి సరిచూసుకున్న తర్వాత సబ్‌మిట్ చేయాలి. ఆ తర్వాత వెనక్కి వెళ్లి గ్రౌండింగ్ బటన్‌ను క్లిక్ చేస్తే వివరాలన్నీ కనిపిస్తాయి.
- బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణ పనులు జరుగు

(మిగతా 8వ పేజీలో)

ఇసుక లభ్యతపై సర్వే రిపోర్టు త్వరగా ఇవ్వాలి



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మానేరు, గోదావరి నదుల్లో ఇసుక లభ్యతపై సర్వే రిపోర్టు త్వరగా ఇవ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇసుక లభ్యత సంబంధించి జిల్లా సర్వే నివేదికను రెవెన్యూ, గనులు భూగర్భ, టీజీఎండీసీ, భూగర్భ జల శాఖ, అటవీశాఖ, నీటిపారుదల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు సంయుక్తంగా పరిశీలించి అక్టోబర్ 1వ తేదీ నాటికి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. జిల్లా సర్వే రిపోర్టు ఆధారంగా ఇసుక క్వారీలను లీజుకు ఇస్తామన్నారు. ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లభిస్తాయని, నిబంధనల ప్రకారం సర్వే రిపోర్టు కట్టుదిట్టంగా తయారు చేయాలని తెలిపారు. ప్రతి శాఖ తమకు సంబంధిం చిన నివేదికలను ఈనెల 15వ తేదీ లోపు అందజేయాలని, తద్వారా తుది నివేదిక అక్టోబర్ 1వ తేదీ నాటికి సిద్ధం చేస్తామన్నారు. మైనింగ్ ఏడీ పి శ్రీనివాస్, డీఎఫ్ఓ శివయ్య, భూగర్భ జల శాఖ ఏడీ జి లావణ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి చేయాలి



సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటు పాదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు అధికారులతో సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలో ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుల పదోన్నతుల కారణంగా హైస్కూల్‌కు వెళ్లిన నేపథ్యంలో ఏర్పడిన ఖాళీలను మండల, పక్క మండలం పరిధిలో అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులతో పారదర్శకంగా సర్దుబాటు ఉండాలని ఆయన తెలిపారు. జిల్లా విద్యాధికారి మాధవి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మల్లేశం గౌడ్, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా 48 మంది ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ జిల్లా ఉపాధ్యాయులుగా 48 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారిని సత్కరించేందుకు జాబితా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. వీరిని ఈ నెల 8న కలెక్టరేట్‌లో సన్మానించనున్నట్లు డీఈవో తెలిపారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు



వ్యవసాయ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సకాలం లో యూరియా సరఫరా చేయని కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సరిపడా యూరియా అందిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న యూరియా నిల్వల గురించి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో యూరియా నిల్వలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కొందరు ప్రతిపక్ష నాయకుల కుట్రలతో యూరియాపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు యూ రియా అందేలా చూడాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలను తనిఖీ చేస్తూ రైతులకు సరఫరా చేసేలా చూడాలన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫోన్ చేసి యూరియా అవసరాలను వివరించారు. యూరియా పంపిణీకి మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఏడీఏ శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

సుల్తానాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో రైతులు యూరియా కోసం ఆందోళన నిర్వహించారు. కొన్ని రోజులుగా సహకార సంఘం గోదాం వద్ద యూరియా పంపిణీ జరుగుతున్నది. శనివారం యూరియా లోడ్ రావడంతో రైతులు ఉదయం నుంచే గోదాం వద్ద బారులు తీరారు. గంటల కొద్ది నిరీక్షించారు. యూరియా బస్తాల కోసం ఎగబడ్డారు. రైతుల మధ్యనే గొడవ పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రవణ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. గోదాములో నిల్వ మేరకు లైన్‌లో ఉన్న రైతులందరికి ఒకటి, రెండు చొప్పున పంపిణీ చేశారు. ఈ విషయమై సహకార సంఘం సీఈఓ బూర్గు సంతోష్ మాట్లాడుతూ వారం రోజులుగా యూరియా నిలువలు రాలేదన్నారు. ప్రస్తుతం 340 బస్తాల యూరియా గోదాంకు చేరిందని, విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో నిల్వల మేరకు వాటిని పంపిణీ చేశామన్నారు. త్వరలో మరిన్ని బస్తాలు వస్తాయని, అందరికి సర్దుబాటు చేస్తామని ఆయన తెలిపారు.

ఎరువుల కోసం చెప్పులతో క్యూలైనులు

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామంలో శనివారం ఎరువుల కోసం రైతులు తరలివచ్చారు. ఎరువులు వచ్చాయనే సమాచారంతో రైతులు క్యూలో చెప్పులు పెట్టారు. రైతులకు ఎరువులు అందించేందుకు దుకాణదారులు సిద్ధం కావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. రైతులకు ఎరువులు అందించినా సాగుకు సరిపోని విధంగా ఇస్తున్నారని వాపోయారు. కాగా 200 బస్తాలు వచ్చాయని, అందరికీ అందజేశామని పేర్కొన్నారు.



యూరియా కోసం గోదాం వద్ద రైతుల పడిగాపులు



క్యూలైన్‌లో చెప్పులు పెట్టిన రైతులు

అంధత్వరహితమే 'సదాశయం'

- ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, దేహదానంపై అవగాహన
- రేపు నేత్రదాన పక్షోత్సవాల ముగింపు

6

వైభవంగా అనంత పద్మనాభస్వామి వ్రతాలు

- నీరుకుల్లలో వైభవంగా పూజలు

7

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదు చేయాలి



ఓటర్ లిస్టును ప్రదర్శిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు

పెద్దపల్లిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పిదాలు, అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 17 ఎంపీటీసీ స్థానాలు, ఒక జడ్పీటీసీ స్థానంకు సంబంధించిన ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఓటరు లిస్ట్‌లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత కార్యదర్శి, లేదా ఈనెల 8న నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశంలో పేర్కొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రమేష్‌బాబు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా రామగుండం తీర్చిదిద్దేందుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. విద్యార్థులే దేశ భవిష్యత్‌కు దిక్సూచి అన్నారు. యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఆరురోజులుగా జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణను, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, రాజకీయాల్లోకి యువత రావాలన్నారు. గోదావరిఖనిలో రోడ్ల విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయని, మెడికల్ కళాశాలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. పీజీ కళాశాలలో వసతిగృహ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరం ద్వారా వలంటీర్లు అంకితభావంతో క్లీన్ అండ్ గ్రీన్ చేయడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.నరేష్, డి.కిరణ్మయి, డి శంకర్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఆసుపత్రి పాలన

- ఖని జనరల్ ఆసుపత్రిలో సిబ్బంది ఇష్టారాజ్యం
- పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వహించని సూపరింటెండెంట్
- హైదరాబాద్ నుంచి విధులకు వస్తున్న వైద్యులు



గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరి ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పాలన అదుపు తప్పింది. కొందరి పైనే పని భారం మోపడంతో గందర గోళంగా తయారైంది. దీంతో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండగా అందుబా టులో మందులు, బెడ్‌లు సరిపోవడం లేదు. 15 రోజు లుగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి 1500 నుంచి 1700మంది వరకు రోగులు వస్తుండగా వారికి బెడ్లు లేక ఒకే బెడ్‌పై ముగ్గురికి చికిత్సను అందించే పరిస్థితి నెలకొన్నది. అందుబాటులో మందులు, సిరం జిల కొరతతో రోగులు బయట కొనుగోలు చేస్తున్నారు. సూపరింటెండెంట్ పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహించడం లేదు. అతను అనారోగ్యానికి గురి కావడంతో బాధ్యతలు సరిగా నిర్వర్తించలేక పోతున్నారు. గత ఏడాది డిసెంబర్ 31న డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టుకు ఆసుపత్రిలో పని చేస్తున్న జనరల్ సర్జన్, హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి డిప్యూటీ సూప రింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. ఏ విధులు కేటాయించకపోవడంతో ఆ పోస్టులో కొనసాగలేక పోయారు. మెడికల్ కళాశాల, ఆసుపత్రి వ్యవహారాలు ప్రిన్సిపాల్ చూస్తున్నారు. ప్రిన్సిపాల్ కూడా మూడు రోజులు ఇక్కడ, నాలుగు రోజులు హైదరాబాద్‌లో ఉంటూ పనులను చక్కబెడుతున్నారని, ఆసుపత్రి పాలన గాలికి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రిన్సిపాల్ వ్యవహారంపై మండిపడినట్టు తెలుస్తుంది. సూపరింటెండెంట్ విధులు నిర్వహించకపోవడం, ఆసుపత్రిలో ఏదో ఒక ఘటన జరుగడం కలకలం రేపుతోంది. రెండు రోజుల క్రితం గర్భంలో శిశువు మృతి చెందడంతో ఆసుపత్రిలో బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే జరిగిందంటూ బంధువులు ఆందోళన చేశారు. ఆగస్టు 8న డిప్యూటీ సూపరింటెండెంట్‌గా గైనకాలజిస్ట్ హెడ్ అరుణకు బాధ్యతలు అప్పజెప్పినప్పటికీ ఆమె కూడా సక్రమంగా నిర్వహించడం లేదు. చాలా మంది వైద్యులు హైదరాబాద్ నుంచి చుట్టపు చూపుగా వచ్చి వెళుతూ విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆగస్టు 17న సూపరింటెండెంట్ గది నుంచి వైద్యులు హాజరు పడే బయోమెట్రిక్ యంత్రం చోరీకి గురైంది. దీనికి బాధ్యులను చేస్తూ 32మంది గార్డుల నుంచి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1600వేతనాల రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. సూపరింటెండెంట్ ఆసుపత్రిలో జరిగే ఘటనలపై తెలియకపోవడం, డిప్యూటీ సూపరింటెండెంట్లు పట్టించుకోకపోవడం ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

43మంది జేఎంఈటీ ట్రైనీలకు పునర్ నియామకాలు

గోదావరిఖని, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్ ఇంజనీరింగ్ ట్రైనీ (జేఎంఈటీ)లుగా చేరి వివిధ కారణాలతో ఉద్యోగం కోల్పోయిన 43మందికి తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సింగరేణి అవకాశం కల్పించింది. ఈ మేరకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. క్రమశిక్షణతో పని చేస్తూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ బలరాంనాయక్ అవకాశాన్ని కల్పించినట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. వీరంతా గతంలో విధులకు గైర్హాజర్ కావడం, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించకపోవడం వల్ల విధుల నుంచి తొలగించారు. ఇటీవల డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మధ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం మేరకే జేఎంఈటీలను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే వీరందరిది తాజా నియామకంగా గుర్తిస్తామని యాజమాన్యం చెప్పింది. వీరంతా సంస్థ ఏర్పాటు చేసే హై పవర్ కమిటీ ముందుకు వెళ్లి వివరాలు, ఓవర్‌మెన్ సర్టిఫికెట్లు, గ్యాస్ టెస్టింగ్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం హైపవర్ కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తరువాత అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. తిరిగి ఉద్యోగంలో చేరిన ఈ ట్రైనీలు మొదటి సంవత్సరం తప్పనిసరిగా 190మస్టర్లు చేయాల్సి ఉంటుంది.

రైతు గోస పట్టించుకోని ప్రభుత్వం

గోదావరిఖని, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూరియా కొరతతో రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే ఎమ్మెల్యే ఆర్ఎఫ్‌సీఎల్ మరమ్మతు కాంట్రాక్టర్‌ను ఎంత వాటా ఇస్తున్నావని అడుగుతున్నాడని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇసుక, మట్టి, బూడిద దందాలు నడుస్తున్నాయని, అడ్డు చెప్పిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. గతంలో ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల విషయంలో మోసపోయిన వారికి డబ్బులు ఇప్పిస్తామని చెప్పి ఇప్పించలేదని, వారితో లోపాయికారి ఒప్పందం జరిగిందా అని ప్రశ్నించారు. ఎఫ్‌సీఐ ప్లాంట్ ప్రారంభం నుంచి అమ్మోనియా లీకవుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అభివృద్ధి అంటే కూలగొట్టడం కాదన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఖని చౌరస్తాలో అధికార పార్టీ ఫ్లెక్సీలకు కమిషనర్ అభ్యంతరం తెలుపలేదని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్ ఐత శివకుమార్, మాజీ కోఆప్షన్ మెంబర్ తస్నీమ భాను, మాజీ కౌన్సిలర్ కృష్ణ స్వామి, జావిద్‌పాషా, బూరుగు వంశీకృష్ణ, మేరుగు చంద్రమౌళి, మడిశెట్టి రవీందర్, కొండ సురేష్, అనుముల కళావతి, పరుశస్వాతి, రాజన్న, పోషం, గణేష్, శ్రీహరి, ఉదయ్, అతహరొద్దీన్, కార్తీక్, ప్రదీప్, నర్సింగ్, శ్రీకర్, అవినాష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వ్యాళ్ల హరీష్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రాజుకుమార్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో శనివారం దుంపల రాజుకుమార్(27) అనే యువకుడు దుర్మరణం చెందాడు. కోరుట్ల మండలం ధర్మారం గ్రామానికి చెందిన దుంపల రాజుకుమార్ వినాయక నిమజ్జనంలో పాల్గొనడానికి అమ్మమ్మ ఊరైన మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి వచ్చాడు. మధ్యాహ్నం వేంపేట గ్రామానికి వెళ్లి తిరిగి ధర్మారం వస్తుండగా ఖానాపూర్ నుంచి మెట్‌పల్లికి వస్తున్న ఆర్టీసీ బస్సును వేంపేట గ్రామ శివారులో ఢీకొని కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించగా అంబులెన్స్ సిబ్బంది దుంపల రాజుకుమార్ మృతిచెందాడని తెలిపారు. సీఐ అనిల్‌కుమార్ పరిశీలించి మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ పబ్బతి అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన దుంపల రాజుకుమార్ నెల క్రితం కుటుంబ సభ్యులతో గడపడానికి ఇంటికి వచ్చి మృతి చెందం గ్రామంలో విషాదం నింపింది.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ..


నరేష్ (ఫైల్)

బీర్‌పూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు ప్రమాదానికి గురైన ఘటనలో ఓ యువకుడు మృతి మరో యువకుడికి గాయాలయ్యాయి. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పూదూరి నరేష్(28), పూదూరి విష్ణువర్ధన్ అనే ఇద్దరు యువకులు శుక్రవారం రాత్రి మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని బాదంపెల్లి గ్రామంలోని వారి సోదరి ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం రాత్రి బాదంపెల్లి- ధర్మారం గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో నరేష్ అక్కడికక్కడే మృతి చెందగా విష్ణువర్ధన్‌కు కాలు, చేయి విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. నిమజ్జనం రోజే ఒక యువకుడు మృతి చెందడం మరో యువకుడు తీవ్రంగా గాయపడటంతో కాలనీలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి
చికిత్స పొందుతూ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం రాంచంద్రపేట గ్రామానికి చెందిన గడిపెల్లి శ్రీనివాస్(52) అనే బీఆర్‌ఎస్ నాయకుడు కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం బీఆర్‌ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 2న మెట్‌పల్లి మండలంలోని కేటీఆర్‌నగర్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గడిపెల్లి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య లత, కుమారుడు, కూతురు ఉన్నారు. గడిపెల్లి శ్రీనివాస్ అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్ నాయకులు, బంధువులు పాల్గొని నివాళులర్పించారు.

అంధత్వ రహితమే సదాశయం


ఓదెలలో నేత్రాల కార్నియాలను సేకరిస్తున్న సిబ్బంది

- మొదటిసారిగా ఓదెలలో ప్రారంభం
- రాష్ట్ర వ్యాప్తంగా విస్తరణ
- రేపు నేత్రదాన పక్షోత్సవాల ముగింపు

ఓదెల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చూపు లేకపోతే అంతా అంధకారమే. అందుకే సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభమై ఈనెల 8న ముగియనున్నాయి. నేత్ర, అవయవదానంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు సదాశయ ఫౌండేషన్ ఓదెలలో 2015లో ప్రారంభమైంది. గ్రామాల్లో, పట్టణాల్లో రోజు,రోజుకు వివిధ కారణాలతో పెరుగుతున్న అంధత్వాన్ని రూపుమాపేందుకు, ప్రాణపాయ స్థితిలో ఉన్న రోగులకు దేహ, అవయవ దానాలతో పునర్జన్మనివ్వడానికి సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు కృషి చేస్తున్నారు. 2015లో మృతుడు గుండేటి రాజేశం నుంచి నేత్రాలను సేకరించిన ఫౌండేషన్ తమ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి 10 ఏళ్ల పాటు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవ, శరీర దానాల కోసం ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. ఓదెలతో పాటు అబ్బిడిపల్లి గ్రామ పంచాయతీలో నేత్రదానం కోసం తీర్మానాలు చేశారు. ఇప్పటివరకు మండలంలో 250 నేత్రాలను దానం చేశారు. కాళోజీ నారాయణరావు శరీర దానంతో ప్రేరణ పొందిన గోదావరిఖనికి చెందిన శ్రావణ్ కుమార్ దేహదాన పత్రం అందజేసి సదాశయ ఫౌం డేషన్ ఆవిర్భవానికి నాంది పలికారు. దీంతో స్వచ్ఛందంగా యువతతో పాటు గ్రామీణ మహిళలు, రైతులు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వచ్చే విధంగా అవగాహన కార్యకలాపాలను విస్తృతం చేశారు.

దీనికి తోడుగా ఎల్.వి. ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, వాసన్ ఐ బ్యాంక్ అండగా ఉండడంతో వీరి సేవ కార్యక్రమాలను ప్రశం సించి జాతీయ అంధత్వ నివారణ జాయింట్ డైరెక్టర్ డా.కళావతి భాయి, అడిషనల్ డైరెక్టర్ శశిశ్రీతో పాటు పలువురి మన్ననలు పొంది మరింత బాధ్యతతో ఫౌండేషన్ కార్యక్రమాలను వర్గాలకతీతంగా నిర్వహిం చేందుకు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు.

స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

శ్రావణ్ కుమార్, సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు



శాశ్వతంగా అంధత్వాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వం అండగా ఉండి, స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలి. స్వచ్ఛంద సేవలతో ముందుకెళుతున్న సంస్థలకు పారితోషకాలను ప్రకటించాలి. పాఠ్యాంశాలల్లో నేత్ర, అవయ,శరీర దానాల ప్రాముఖ్యతపై పాఠాలను పొందుపరచాలి.

ఓదెలను ఆదర్శ గ్రామంగా ప్రకటించాలి

మేర్గు భీష్మ చారి, ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి



సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి సారిగా ఓదెలలో నేత్ర దానాలను ప్రారంభించి గ్రామపంచాయతీ తీర్మానాలను చేయించాం. స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న ఓదెల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ప్రభుత్వం ప్రకటించాలి. అంధత్వరహిత తెలంగాణ ధ్యేయంగా నిస్వార్థతతో చేస్తున్న కృషికి అండగా ఉండాలి.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం, ఆర్టీసీ బస్సు శనివారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన కాంట్రాక్ట్ టీచర్ వినోద్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్నపల్లి గ్రామానికి చెందిన వినోద్ వేములవాడ మైనార్టీ పాఠశాలలో కాంట్రాక్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన బైక్‌పై స్వగ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు ప్రయాణిస్తుండగా కంచర్ల గ్రామ శివారులోని మూల మలుపు వద్ద అటుగా వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మండల కేంద్రంలో చికిత్స పొందుతున్న వినోద్‌ను ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు రాంరెడ్డి, బాబు, చాంద్‌పాషా, అరుణ్‌కుమార్, దేవరాజు, బాల్‌రెడ్డిలు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వీర్నపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న వినోద్ తండ్రి శ్రీనివాస్‌ను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడలో శుక్రవారం వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన భీరం రాజేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం టౌన్ ఎస్ఐ రవి కిరణ్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది నిమజ్జనం విధులు నిర్వహించారు. గణేష్ నిమజ్జనం చేసే కొంత మంది యువకులు అర్ధరాత్రి సమయంలో రోడ్డు బ్లాక్ చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించారు. విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న సమయంలో భీరం రాజేష్ అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించాడు. టౌన్ పోలీస్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బోయినపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు క్షణికావేశంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శనివారం జరిగింది. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పోతుల అరవింద్(21) హైదరాబాద్‌లోని ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అయితే అరవింద్ వినాయక నిమజ్జనం కార్యక్రమానికి స్వగ్రామం వచ్చాడు. తెల్లవారుజామున ఉరివేసుకొని కుటుంబ సభ్యులు కనిపించాడు. అరవింద్ సోదరుడు వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు అప్పటికే అరవింద్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

నిమజ్జన వేడుకల్లో ఘర్షణ

- ఇరు వర్గాలపై కేసు

మల్యాల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని తూర్పువాడ ప్రాంతంలో శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా జరిగిన ఇరువర్గాల ఘర్షణలో పరస్పర ఫిర్యాదులపై పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్యాల తూర్పువాడలో గల గణేష్ మండలి నుంచి విడిపోయి మరో చోట కొడారి రణధీర్, మనోజ్‌తో పాటు మరి కొందరు వినాయక మండపం ఏర్పాటు చేశారు. దీంతో శోభయాత్రలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. కైలాసపు మహేష్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు రణధీర్, మనోజ్ మరి కొందరిపై కేసు నమోదు చేయగా, రణధీర్, మనోజ్ తల్లి పవిత్ర కూడా మహేశ్, ముదాం నాగరాజ్‌తో పాటు మరి కొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వినాయక మండపంలో అగ్ని ప్రమాదం

వీణవంక,సెప్టెంబర్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలోని వినాయక మండపం వద్ద అగ్ని ప్రమాదం జరిగింది. వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించిన తర్వాత అర్ధరాత్రి మండపంలో ఉన్న సౌండ్ బాక్స్‌లు ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (27) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పెద్దపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 4న పొలం వద్ద పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి పోచమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

మానకొండూర్‌లో రోడ్డు ప్రమాదం

- వృద్ధుడికి గాయాలు

మానకొండూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన కేంద్రం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మానకొండూర్ గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మీనర్సయ్య(70) అనే వృద్ధుడు గణేష్ నిమజ్జనాన్ని తిలకించేందుకు చెరువు వద్దకు చేరుకున్నాడు. హుజూరాబాద్ వైపు నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వృద్ధుడిని ఢీకొట్టింది.ప్రమాదంలో లక్ష్మీనర్సయ్యకు తీవ్రగాయాలు కాగా పోలీసులు 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తకలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

నలుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వినాయకుడి ఊరేగింపులో ఇద్దరిపై దాడికి పాల్పడిన నలుగురు యువకులపై శనివారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. జమ్మికుంట పట్టణంలోని కొండూర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం కోసం ఊరేగింపుగా రాత్రి 11గంటలకు తీసుకువస్తున్నారు. అదే సమయంలో అటు వైపుగా వచ్చిన పద్మశాలి వీధికి చెందిన శ్యామ్, సందీప్, రాకేష్, హేమంత్‌లు తాము డ్యాన్స్ చేస్తాం.. పాటలు పెట్టండి అని అడిగారు. దీంతో పాటలు పెట్టగా డ్యాన్సు చేస్తూ వినాయకుడిని ముందకు కదలనివ్వలేదు. నిర్వాహకులు గెల్లు రాజశేఖర్ ముందుకు సాగాలని చెప్పాడు. కోపంతో రగిలిపోయిన యువకులు అతడిని కింద పడేసి దాడి చేశారు. అడ్డు వచ్చిన మరో వ్యక్తి శ్రీనివాస్‌పై కూడా దాడి చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఆర్సీ ప్రకటించాలి

హుజూరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రహణం

- కాంట్రాక్టరు నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారులు
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి

గంభీరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మించతలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రహణం పట్టింది. బ్రిడ్జి నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నా.. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో రెండేళ్లుగా ఇదే తీరు కొనసాగడం విస్మయం కలిగిస్తోంది. ఈ మార్గంలో వాగుపై గతంలో లోలెవెల్ బ్రిడ్జి ఉండేది. ప్రతి వర్షాకాలంలో నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు మత్తడి దూకడంతో లింగన్నపేట వాగు ఉధృతంగా ప్రవహించి, ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతూ దూరమార్గాల ద్వారా గమ్యం చేరేవారు. ఈ సమస్యపై ఈ ప్రాంతం నాయకులు, ప్రజలు అప్పట్లో హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలని గత ప్రభుత్వ హయాంలో కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతపై స్పందించిన కేటీఆర్ రూ. 10 కోట్ల 60 లక్షలు మంజూరు చేయడమే కాకుండా 2023 సెప్టెంబరు మాసంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సదరు కాంట్రాక్టర్ పాత లోలెవెల్ బ్రిడ్జిని కూల్చేసి, అదే స్థలంలో కొత్త బ్రిడ్జి పనులు చేపట్టారు. ఆ క్రమంలో లక్షలు విలువ చేసే పాత బ్రిడ్జి సలాకను అమ్మేశారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పాత సలాకను వేలం వేయకుండా అమ్మేశారంటూ అప్పట్లో పాత బ్రిడ్జి సలాక వ్యవహారంపై పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ వ్యవహారంలో ముడుపుల బాగోతం కూడా నడిచిందని, పుకార్లు వ్యాపించాయి. పాత బ్రిడ్జి ఐరన్ వ్యవహారం ఇలా ఉంటే వర్షాకాలం రాక ముందే హైలెవల్ బ్రిడ్జి పూర్తి అవుతుందని ఆశించిన ప్రజానికానికి నిరాశే మిగిలింది. రెండేళ్లుగా హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన మార్గం ఇదే కావడంతో తాత్కాలికంగా మట్టి రోడ్డు వేస్తున్నారు. ప్రతి ఏటా మట్టి రోడ్డు వేయడం వర్షాకాలంలో మానేరు మత్తడి దూకి మట్టి రోడ్డు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్షం పరస్పర ఆరోపణలు చేసుకోవడం కొసమెరుపు.


గంభీరావుపేట-లింగన్నపేట మధ్య మానేరు వాగుపై పిల్లర్ల స్థాయిలో నిలిచిన బ్రిడ్జి

బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

- కోడె రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు



గంభీరావుపేట-లింగన్నపేట మానేరు వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులను సత్వరమే వేగవంతం చేయాలి. రెండేళ్లుగా సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల బ్రిడ్జి పనుల్లో తీవ్రం జాప్యం జరుగుతోంది. బ్రిడ్జి నిర్మాణంలో అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొట్టచ్చినట్టు కనిపిస్తోంది. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టాలని బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతాం.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు


వీణవంకలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మాధవి

వీణవంక,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు పట్టుకున్నట్లు హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. ఏసీపీ వివరాల ప్రకారం.. శనివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక రవిని పట్టుకున్నట్టు తెలిపారు. అతను మండలంలోని దేశాయిపల్లి, చల్లూరు, మామిడాలపల్లి, జమ్మికుంటలోని కొత్తపల్లి,మానకొండురులోని అన్నారంలో వృద్ధులను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఐదు చోట్ల దొంగతనాలు చేసి 14 తులాల బంగారం చోరీ చేసినట్టు తెలిపారు. సుల్తానాబాద్‌లోని ముత్తూట్ ఫిన్ కేర్‌లో పెట్టినట్టు తెలిపారు. చోరీకి గురైన బంగారంలో 11 తులాలు రికవరీ చేసినట్లు మిగతా బంగారం మహారాష్ట్రలో గుర్తు తెలియని వ్యక్తికి అమ్మినట్టు తెలిపారు. ఏసీపీ వెంట జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఆవుల తిరుపతి ఉన్నారు. కేసును ఛేదించిన సిబ్బందికి రివార్డులు అందించారు.

గాయపడిన పాముకు చికిత్స


పాముకు చికిత్స చేస్తున్న పశువైద్యుడు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లక్ష్మీనగర్‌లోని ఒక ఇంటిలో పాము చొరబడగా సమాచారం అందుకున్న శ్రీలక్ష్మి జంతు సంరక్షణ శాల అధ్యక్షుడు అసిరి సుమన్ పటేల్ అక్కడికి వెళ్లి పామును క్షేమంగా పట్టుకుని కరీంనగర్‌లోని పశు వైద్యశాలకు తరలించాడు. అప్పటికే పాము తోక భాగంలో తీవ్ర గాయమైనట్లు గుర్తించిన వైద్యులు బోగం అజిత్ రత్నం, ప్రణయలు పాముకు చికిత్స చేశారు. అనంతరం పామును శ్రీలక్ష్మి జంతు సంరక్షణశాలలో ఉంచామని సుమన్ పటేల్ తెలిపారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

- వినాయక నిమజ్జనంలో అపశృతి


గోదావరి వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్ కాలనీ/జైపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వినాయక నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకున్నది. నిమజ్జనం నిమిత్తం గోదావరినది తీరానికి వెళ్లిన నరకట్ల రాజేష్(24) అనే యువకుడు శనివారం తెల్లవారు జామున నదిలో పడి గల్లంతయ్యాడు. రామగుండంలోని అక్బర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి నిజమజ్జన శోభయాత్రలో రాజేష్ మిత్రులతో కలసి పాల్గొన్నాడు. గోదావరి బ్రిడ్జికి తెల్లవారు జామున రాజేష్ అతడి మిత్రులు చేరుకున్నారు. బ్రిడ్జి మీద స్టాండ్‌పై గణపతి ప్రతిమను ఉంచే క్రమంలో అదుపుతప్పిన రాజేష్ నదిలో పడ్డాడు. పోలీ సులు రాజేష్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి వరకు నదిలో రాజేష్ ఆచూకీ తెలియక పోవడంతో తాత్కాలికంగా గాలింపు నిలిపివేశారు. గోదావరి పరివాహక గ్రామాలైన ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, బెజ్జా, కుందారంలోని మత్స్యకారులకు, రైతులకు, యువకు లకు ఎవరైనా రాజేష్ యాదవ్ ఆచూకీ తెలిస్తే జైపూర్ ఎస్ఐ ఫోన్: 871265 6551కు తెలియజేయాలన్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

- రూ. 2లక్షల సాయం ప్రకటన


నదిలో గల్లంతైన రాజేష్ యాదవ్

యైటింక్లయిన్‌కాలనీ : గోదావరినదిలో పడి గల్లంతైన రామగుండానికి చెందిన రాజేష్ కుటుంబ సభ్యులను శనివారం గోదావరిఖని గోదావరి వంతెన వద్ద రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నిమజ్జనానికి సంబంధించి మున్సిపల్, సింగరేణి అధికారులతో విస్తృత ఏర్పాటు చేసి పోలీస్ యంత్రాగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసినప్పటికీ ఈ ఘటన జరుగడం బాధాకరమని అన్నారు. రాజేష్ ఆచూకీ కోసం ప్రత్యేక బలగాలతో పాటు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టామని తెలిపారు. వారి కుటుంబ సభ్యులు పేదరికంతో ఉన్నారని, కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. తన వ్యక్తిగతంగా రూ.2లక్షల ఆర్థిక సహకారాన్ని అందించడంతో పాటు ప్రభుత్వపరంగా న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని, నివాస స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

శంకరపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శంకరపట్నం మండలం మక్తలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని మక్త గ్రామానికి చెందిన కల్వల రాజవ్వ (70) అదే గ్రామంలోని రోడ్డుపై వెళ్తుండగా ధర్మారం గ్రామానికి చెందిన దేవునూరి కిష్టయ్య తన ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా అతివేగంగా నడుపుతూ రాజవ్వను ఢీకొట్టాడు. దీంతో రాజవ్వ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కల్వల మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా మృతురాలికి ఒక కూతురు ఉండగా, చంద్రపూర్‌లో ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. వృద్ధురాలు సమీప బంధువుల వద్ద ఉంటోంది.

మత్స్యగిరీంద్రస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి


పూజలు చేస్తున్న జడ్జి దంపతులు

శంకరపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామిని జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షరిన ప్రశాంత్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచ నాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. జడ్జి దంపతులను ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి శాలువాతో సన్మానించారు.

ఇల్లందకుంట ఆలయ హుండీ లెక్కింపు

- రూ. 8,59,961 ఆదాయం

ఇల్లందకుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట రాములోరి హుండీ ఆదాయం రూ. 8,59,961 వచ్చినట్లు ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో దేవాదాయ పరిశీలకులు సత్యనారాయణ, ఈవో కందుల సుధాకర్, చైర్మన్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా 4నెలల 14రోజులకు రూ. 8,59,961 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శేషం రామాచార్యులు, మడికొండ నవీన్‌కుమార్, సిబ్బంది మోహన్, మల్లారెడ్డి, సురేందర్‌రావు, కమిటీ సభ్యులు కిషన్‌రెడ్డి, నాగరాజు, గోపాల్‌రెడ్డి, మల్లేస్, అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ గేట్లు మూసివేత

ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రావడం శనివారం తగ్గడంతో గేట్లను మూసివేశారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 79.658 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు06 (ఆంధ్రజ్యోతి) శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్ మానేరు) ప్రాజెక్టు శనివారం 14000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టుకు క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14000 క్యూసెక్కులు నీటి ప్రవాహం కొనసాగుతోంది. కాగా ప్యాకేజీ 10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.52 ఉండగా, నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.324 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.13టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయక సాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా శనివారం రాత్రి 22.707 టీఎంసీల నీరు ఉంది. ఎగువ కాకతీయ కాలువ నుంచి 2000 క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 705క్యూసెక్కులు మొత్తం 2750 క్యూసెక్కుల నీరు వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 3వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

నేడు కొండగట్టు అంజన్న ఆలయం మూసివేత

మల్యాల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం దృష్ట్యా ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని మూసి వేయనున్నట్లు ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి వారికి నివేదన అనం తరం దేవాలయ ద్వార బంధనం చేయడం జరుగుతుందని అన్నారు. సోమవారం ఆలయంలో వేకువజామున పుణ్యాహవ చనం, సంప్రోక్షణ, తిరుమంజనం, ఆరాధన పూజలు జరిపిన అనంతరం ఉదయం 7 గంటల నుంచి ఆలయం తెరచి యథావిధిగా దర్శనాలు, ఆర్జితసేవలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మధ్య తరగతికి ఊరట..



- జీఎస్టీ స్లాబ్‌ల కుదింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు లబ్ధి
- వ్యవసాయ ఉపకరణాలన్నీ ఐదు శాతం స్లాబ్‌లోకి..

జగిత్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న జీఎస్టీ (గూడ్స్ సర్వీస్ ట్యాక్స్) స్లాబ్‌ల కుదింపు నిర్ణయంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారీగా లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు జీఎస్టీ విధింపులో నాలుగు స్లాబ్‌లు ఉండగా వాటిని రెండింటికి కుదించారు. పేదలు, రైతులు, మహిళలు, యువత వినియోగించే అనేక వస్తువులపై పన్ను భారాన్ని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. సంబంధిత వర్గాల ప్రజలు వినియోగించే వస్తువులు, 12 రకాల సేవలు, 18 శాతం ఉన్న వాటిని ఐదు శాతం స్లాబ్‌లోకి మార్చారు.

ఇందులో అనేక రకాల నిత్యావసర వస్తువులు సైతం ఉన్నాయి. దీంతో కుటుంబ ఖర్చులు కూడా తగ్గనున్నాయి. 18, 12 శాతం జీఎస్టీలో ఉన్న కొన్ని రకాల వస్తువులను ఐదు శాతానికి తగ్గించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఖర్చులే కాకుండా వ్యక్తిగత ఖర్చు కూడా సగటున 10 శాతం ఆదా అయ్యే అవకాశం ఉందని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. జగిత్యాల జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న రైతులు, మహిళలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో భారీ మేలు జరగనుంది.

రైతులు, మహిళలకు లబ్ధి..

జగిత్యాల జిల్లాలో సుమారు 2.80 లక్షల మంది రైతులు ఉన్నారు. సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలపై ప్రభుత్వం ఇప్పటికే రాయితీలు వర్తింప జేస్తోంది. కొంత కాలంగా వ్యవసాయ వస్తువులపై రాయితీలు తగ్గిపోవడమే కాకుండా పన్నులు వడ్డింపు పరిధిలోకి వెళ్లాయి. దీంతో సాగు పెట్టుబడి ఖర్చులు పెరిగి వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రైతుకు వచ్చే నికర లాభం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీంతో నష్టాల పాలవుతున్నారు. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణ యంతో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలపై పన్ను భారం తగ్గనుం ది. రైతులు వినియోగించే ట్రాక్టర్ల టైర్లు, విడి భాగాలు, కొన్ని రకాల పురు గుల మందులు, సూక్ష్మ పోష కాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులు కొనుగోలు ఖర్చు లు తగ్గనున్నాయి. 18 నుంచి 12 శాతం స్లాబ్‌లోని వాటిని ఐదు శాతం జీఎస్టీ పరిధిలోకి తెచ్చారు. దీంతో జిల్లా లోని రైతులకు మేలు చేకూర నుంది. కుట్టు మిషన్లు వాటి విడిభాగాలు, మహిళలు, చిన్నారుల కోసం వినియోగించే పలు రకాల వస్తువులపై పన్ను భారం తగ్గనుంది. జిల్లాలోని సుమారు ఐదు లక్షలకు పైచిలుకు మహిళలకు లబ్ధి చేకూరనుంది.

తగ్గనున్న పన్ను భారం..

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రజలపై పన్ను భారం తగ్గనుంది. వారు వినియోగించే వస్తువుల ధరలు తగ్గనున్నాయి. టీవీలు, చిన్న, మధ్య శ్రేణి కార్లు, బైకులు, వైద్య పరికరాలు, చిన్న పిల్లల కోసం వినియోగించేవి, విద్యార్థులకు అవసరమైన వస్తువులపై కూడా పన్నుల భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది.



బీజేపీ పేదల ప్రభుత్వం

యాదగిరిబాబు, బీజేపీ జగిత్యాల అధ్యక్షుడు



మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమే. ఏ సంస్కరణలు తెచ్చినా, ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా ఉంటాయి. జీఎస్టీ స్లాబ్‌ల కుదింపు నిర్ణయం ఎంతో మంచిది.

కుటుంబ ఖర్చులు ఆదా అవుతాయి

అడిగొప్పుల రజిని, గృహిణి, జగిత్యాల జిల్లా



మహిళలు వినియోగించే కుట్టు మిషన్లు, వాటి విడి భాగాలతో పాటు చిన్న పిల్లల కోసం వినియోగించే పలు రకాల వస్తువులపై పన్ను భారం తగ్గనుంది. పలు గృహోపకరణ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో కుటుంబ ఖర్చులు సుమారు పది శాతం తగ్గనున్నాయి. రైతులు, మహిళలు, చిన్నారులు, యువత ఇలా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

రైతులకు ప్రయోజనం చేకూరుతుంది

గోపాల్‌రెడ్డి, కిసాన్‌సెల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. వ్యవసాయ పనిముట్లు, యంత్రాలపై పన్ను భారం తగ్గనుంది. రైతులు వినియోగించే ట్రాక్టర్ల టైర్లు, విడి బాగాలు, కొన్ని రకాల పురుగుల మందులు, సూక్ష్మ పోషకాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులు కొనుగోలు ఖర్చులు తగ్గనున్నాయి.

గిన్నిస్ బుక్‌లో అల్ఫోర్స్ విద్యార్థినికి చోటు



శ్రీనిత్యను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత వి నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అల్ఫోర్స్ విద్యార్థిని గజబింకార్ శ్రీనిత్య కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటి చోటు సాధించింది. శనివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని పాఠశాల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటినట్లు తెలిపారు.

అంతర్జాతీయ చదరంగంలో విశృత్ రామ్‌కు ఫిడే రేటింగ్



కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి):కరీంనగర్ జిల్లాకు చెందిన అకెనపల్లి విశృత్‌రామ్ అంతర్జాతీయ చదరంగంలో ఫీడే రేటింగ్ సాధించాడు. విజయ వాడలో గత నెల 26 నుంచి 31వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ ఫీడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అంతర్జాతీయస్థాయిలో 1414 ఫీడే రేటింగ్ సాధించాడు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కంక టి కనకయ్య, అకాడమీ డైరెక్టర్, సీనియర్ కోచ్ అనూప్ కుమార్, కేశెట్టి జగన్, ఉమ్మడి జిల్లా చెస్ డెమోక్రటిక్ సంయుక్త కార్యదర్శి కంకటి సుజన్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, అభిరామ్ రేవిక్, నితిన్ అరుణ్, తరుణ్, శ్రీనిజ, స్వాతి అభినందించారు.

క్రీడా పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



గేమ్స్, స్పోర్ట్స్ సెలక్షన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి, విప్, కలెక్టర్

కోనరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోనరావుపేట మండలం మర్రిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 5వ రాష్ట్రస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలక్షన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో క్రీడా పోటీల నిర్వహణకు మంచి ఏర్పాట్లు చేసిన అధికారులను, సిబ్బందిని మంత్రి అభినందించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 1200 మంది పైగా విద్యార్థులకు క్రీడాపోటీలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. ఏకలవ్య పాఠశాలలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత 740 కోట్ల రూపాయలు గిరిజన గ్రామ పంచాయతీలకు విడుదల చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ విప్ కోరిక మేరకు గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణానికి అదనంగా 10 కోట్లు రూపాయలు తప్పనిసరిగా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. గురుకులాల్లో ఉపాధ్యాయులు చెప్పే మాటలు పాటించాలన్నారు. చిన్నారులలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఉపాధ్యాయుల అంతర్గత బదిలీలు, పదోన్నతుల కల్పన, గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు, ప్రతి నియోజకవర్గ పరిధిలో 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం, అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సెంటర్‌ల ద్వారా ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించడం వంటి అనేక కార్యక్రమాలను విద్యాశాఖలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలలో విద్యార్థు లంతా ఉత్సాహంతో పాల్గొనాలని, రాష్ట్రం నుంచి అధి కంగా క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని కోరారు. రాబోయే మూడు రోజుల పాటు ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీల సందర్భంగా విద్యార్థులందరికీ మంచి ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడా పోటీల నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఈఎంఆర్ఎస్ సెక్రెటరీ సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ 5వ జాతీ య ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ సెలక్షన్ మీట్ జరుగుతుం దని, ఇందులో 300 మంది క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయ ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 1200 మంది బాలికలు వచ్చారని, 16 రకాల క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన మాలావత్ పూర్ణ మాట్లాడుతూ గురువుల పాఠశాలలో చదువు కున్న తాను ఎవరెస్ట్ శిఖరం అధిరోహించానన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా నిర్దేశించుకున్న మంచి లక్ష్య సాధన కోసం కృషి చేస్తే సమాజం మొత్తం సహకారం అందిస్తుందన్నారు. అనంతరం మంత్రి, విప్, కలెక్టర్‌లను స్కూల్ యాజమాన్యం సన్మానం చేశారు. కబడ్డీ క్రీడా పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజు, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఆర్డీవో రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో కేవీకేకు ప్రథమ ర్యాంకు



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) 2024లో సాధించిన ప్రగతిని గుర్తిస్తూ వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు, జోనల్ స్థాయిలో మూడవ ర్యాంకు కేటాయించింది. వెల్లూరు, తమిళనాడులో కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సమావేశంలో వివరాలు ప్రకటించారు. జోన్ ఎక్స్ పరిధిలోని తెలం గాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 72 కృషి విజ్ఞాన కేంద్రాలు పాల్గొని 2024లో సాధించిన ప్రగతిని వివరించారు. ఇందులో జమ్మికుంట కేవీకే రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, జోనల్ స్థాయిలో మూడో స్థానం దక్కించుకుంది. ప్రముఖుల చేతుల మీదుగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎన్ వెంకటేశ్వర్‌రావు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

పత్తి దిగుమతులపై సుంకాలు రద్దు చేయడం సరికాదు

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసుదేవరెడ్డి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

జమ్మికుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విదేశీ పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం 11శాతం సుంకాన్ని రద్దు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో రైతు సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులను నట్టేట ముంచేందుకు చూస్తుందన్నారు. 2025 డిసెంబరు 31వరకు విదేశీ పత్తి దిగుమతులపై ఉన్న సుం కాలను రద్దు చేయడం దుర్మార్గం అన్నారు. టెక్స్‌టైల్ యాజమానుల కోరిక మేరకు విదేశీ పత్తిపై సుంకాన్ని రద్దు చేశామనడం అవివేకం అన్నారు. మన దేశం నుంచి ఎగుమతి చేసే అన్ని రకాల వస్తువులపై అమెరికా 25 శాతం నుంచి 50శాతం టాక్స్ పెంచితే మన కేంద్ర ప్రభుత్వం ఉన్న 11 శాతం టాక్స్ రద్దు చేయడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతారన్నారు. విదేశాల నుంచి పెద్ద ఎత్తున పత్తి దిగుమతి అవుతుం దన్నారు. పత్తి పంటను మొత్తం సీసీఐ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శీలం అశోక్, కోశాధికారి బాసర సంపత్‌రావు, మండల అధ్యక్షులు కాయిత లింగారెడ్డిపాల్గొన్నారు.

మందుల ధరలను నియంత్రించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మందులు, వైద్య పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని తగ్గించడాన్ని స్వాగతిస్తున్నామని, మందుల ధరలను నియంత్రించాలని ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పార్థ రక్షిత్, తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మిరుపాల అంజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 అత్యవసర మందులపై ఉన్న 12శాతం జీఎస్‌టీని తొలగించడం, క్యాన్సర్, అరుదైన వ్యాధులు, తీవ్రమైన వ్యాధుల చికిత్సలో వాడే 3 రకాల మందులపై ఉన్న 5 శాతం జీఎస్‌టీని తొలగించడం, ఇతర మందులపై ఉన్న 12 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించడం, ఆపరేషన్, డెంటల్, వెటర్నరీ పరికరాలపై ఉన్న 18 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించడం, గాజు, బ్యాండెజీలు, డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్ వంటి పరికరాలపై వసూలు చేస్తున్న 12 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించడం శుభపరిణామమని పేర్కొన్నారు. మందులు, వైద్యపరికరాలపై ఉన్న జీఎస్‌టీని తాము మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గనుందన్నారు.

ధర్మపురిలో ముగిసిన భాగవత సప్తాహం



మహేశ్వర్‌శర్మను సత్కరిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దేవస్థానం, శారదా మహిళా మండలిచే నిర్వహించిన భాగవత సప్తాహం కార్యక్రమం శనివారం ముగిసింది. రామలింగేశ్వరస్వామి ఆలయంలో భాద్రపద మాసం పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 7 వరకు బ్రహ్మశ్రీ పురాణపు మహేశ్వర్‌శర్మ శ్రీ మద్భాగవతం పురాణం ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 7న చంద్ర గ్రహణం ఉన్నందున ముందుగా ముగించారు. మహేశ్వర్‌శర్మను ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆశీర్వదించగా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మహేశ్వర్‌శర్మను సన్మానించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో మంత్రి అడ్లూరి పూజలు

ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం సందర్శించారు. అనంతరం గోదావరి నది వద్ద జరిగే వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎస్ఐ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అనంత పద్మనాభ స్వామి వ్రతాలు



వ్రతాలలో పాల్గొన్న దంపతులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభ స్వామి వ్రతాలను శనివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని నీరుకుల్లలోని భూ నీలసమేత మానేటి రంగనాయక స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి వ్రతాలను సామూహికంగా నిర్వహించారు. కోటి వత్తులతో వెలిగించే దీపాల ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని వైభవంగా జరుపుకున్నారు. పలువురు ఇళ్లలో వ్రతాలను ఆచరించారు. పలు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో దంపతులు పాల్గొని వ్రతాలను నోముకున్నారు. యేటా రంగనాయక స్వామి ఆలయంలో అనంత పద్మనాభస్వామి వ్రతాలు ఆచరిస్తుంటారు. ఇందులో పాల్గొనే భక్తులకు ఉదయం, మధ్యాహ్నం అల్పాహారం, అన్నదానాలు చేశారు. ఆలయ ఈవో శంకర్ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించగా, నీరుకుల్ల మాజీ సర్పంచ్ కోటగిరి విజేందర్‌గౌడ్, ఆలయ అర్చకులు గోవర్ధనగిరి జగన్నాథచార్యులు, వేణుమనోహరచార్యులు, శ్యాంసుందర్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం రాజన్న దర్శనానికి ఐఏఎస్ అధికారి, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ అడిషనల్ సీఈవో కాత్యాయని దేవి ఈ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, అధికారులు రాజన్న ప్రసాదం అందజేశారు. అలాగే రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కమిషనర్, ఐఏఎస్ అధికారి సీతాలక్ష్మి రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అర్చకులు ఆశీర్వచనం అందించగా, ఆలయ ఈవో రమాదేవి రాజన్న ప్రసాదం అందజేశారు.

ఈవో రమాదేవిని సన్మానించిన ఉద్యోగులు..



ఈవో రమాదేవిని సన్మానిస్తున్న రాజన్న ఆలయ ఉద్యోగులు

శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ ఈవోగా వచ్చిన పదవీ బాధ్యతలు చేపట్టిన రమాదేవిని ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, జయకుమారి, శ్రీనివాస్, ఎడ్ల శివ, బొడుసు మహేష్ యాదవ్, ఆగంరావు తదితరులు ఉన్నారు.

నెలాఖరులోగా 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలి

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 2500 ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం లక్ష్యమని, ఇప్పటివరకు 350 ఎకరాల్లో మాత్రమే పూర్తయిందన్నారు. సెప్టెంబర్ చివరి నాటికి జిల్లాలో 500 ఎకరాల్లో సాగు పూర్తయ్యేలా చూడాలన్నారు 10 ఎకరాలకు పైగా ఉన్న రైతులు సాగుచేసేలా చూడాలన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్యాలు కేటాయించాలని అన్నారు. ఆయిల్ పామ్ మొక్కలతో పాటు, డ్రిప్ ఏర్పాటుకు రైతుల నుంచి డీడీలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో వచ్చే ఆదాయంపై ప్రచారం చేయాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు మొక్కలు నాటిన తర్వాత డ్రిప్ ఏర్పాటు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు జ్యోతి మహేష్ పాల్గొన్నారు.

పట్టణాల్లో పాలన సమర్థవంతంగా జరగాలి

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణాలలో పాలన సమర్థవంతంగా జరగాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పని తీరుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో రోడ్లపై పశువులు ఉండకుండా గోశాలలకు తరలించాలని, కోతుల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడ డార్క్ ఏరియా ఉండకుండా విద్యుత్ స్తంభాలు లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఆటంకాలు లేకుండా నీటి సరఫరా చేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా రోడ్లపై ఎలాంటి చెత్త లేకుండా చూడాలని, వీధి కుక్కలు పందులను ఊరికి దూరంగా తరలించాలన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో భాగంగా ఎటువంటి ఆక్రమణలు రోడ్లపై లేకుండా చూడాలని, అనుమతి లేని నిర్మాణాలను తొలగించుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటి, ఆస్తి పన్ను వసూలు చేయాలని, పట్టణాల్లోని మురికి కాలువలు, నాళాలలో సిల్ట్ తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు వెంకన్న, రమేష్ అధికారులు, పాల్గొన్నారు.

పలు శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష

మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలి

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలలో దెబ్బతిన్న రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, తాగునీటి పైప్‌లైన్, పీహెచ్‌సీలు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యుత్ తీగలు స్తంభాల మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, అసౌకర్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, జిల్లాకు వచ్చిన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు రోజుల్లో వరద ప్రభావిత ప్రాంతాల మరమ్మతు పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వరద ప్రాంతాల్లో చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్ పెట్టకుండా చూడాలని కలెక్టర్ కోశాధికారిని ఆదేశించారు. డీపీఓ వీరబుచ్చయ్య, జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, డీఈవో మాధవి, జిల్లా ఇన్చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కమాన్‌పూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పిల్లలు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ సౌమ్యలు మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి అంచెలంచెలుగా రాష్ట్రపతిగా ఎదిగారని కొనియాడారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం పిల్లలు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉపాధ్యాయులు ఫర్హీన్, వహీద, మౌనిక, సంధ్య, జ్యోత్స్న, లక్ష్మి, శిరీష, విజయలక్ష్మి, రవళి, స్పందన, షహనాజ్ బేగం, చంద్రలేఖ, శరణ్య, రవీందర్, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కల్వచర్లలోని ప్రగతి పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువలతో సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి మాట్లాడుతూ మన జీవితాలకు సన్మార్గం చూపే గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులుగా అభివర్ణించారు. ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్, క్లబ్ కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి, క్లబ్ డైరెక్టర్ టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రగతి పాఠశాల డైరెక్టర్లు నాగరాజ కుమారి, లక్ష్మారెడ్డి, పిన్స్‌పాల్ గొవర్ధన్, రమణరెడ్డి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానించిన ప్రిన్సిపాల్

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని ఆపిల్‌కిడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్ ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. తరగతి గదిలో సమాజం భవిష్యత్ రూపకల్పన అవుతుందన్నారు. అందుకు ఉపాధ్యాయులేనని, వారి పాత్ర ఎంతో ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. నాయకులు మహంకాళిస్వామి, ప్రిన్సిపాల్ గాలి సునీత, వైస్ ప్రిన్సిపాల్ అరుణ, ఫర్జాన, సుష్మిత, పాల్గొన్నారు.

రైతులను కన్నీరు పెట్టిస్తున్న ప్రభుత్వం

గోదావరిఖని, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని, రైతులను కన్నీరు పెట్టిస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న రైతాంగం ఇప్పుడు అరిగోస పడుతున్నదని చెప్పారు. శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారిని ఆహ్వానించి చందర్ మాట్లాడుతూ రైతులు యూరియా కోసం నానా కష్టాలు పడుతున్నారని, ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. పాలకుర్తి మండలం తక్కళ్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు నరిమెట్ల పెద్ద మల్లేషం, శ్రీనివాస్, రాయపోషం, మిట్ట రాజయ్య, తీగల స్వామి బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు కొమురయ్య, నారాయణదాసు మారుతి, శ్రీనివాస్, రాజన్న, హుస్సేన్ ఉన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

వైభవంగా గణనాథుని శోభాయాత్ర

ఎలిగేడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముప్పిరితోట అనుబంధ గ్రామం మల్లయ్యపల్లి, ఎలిగేడు గ్రామాల్లో శనివారం గణపతి శోభాయాత్రను నిర్వహించారు. పదిరోజులపాటు వినాయకులను పూజించి నిమజ్జనానికి ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మధుకర్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని గోదావరినది తీరంలో వినాయక విగ్రహాల నిమజ్జనం శనివారం కొనసాగింది. మంథనితోపాటు వివిధ గ్రామాలు, మండలాలకు చెందిన విగ్రహాలను నది తీరానికి భక్తులు తీసుకువచ్చి సింగరేణి ఏర్పాటు చేసిన క్రేన్ సహాయంతో నిమజ్జనం చేశారు. యువత నృత్యాలు అలరించాయి.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 61 పీట్ల మహాగణపతి నిమజ్జనం శనివారం రాత్రి వరకు కొనసాగింది. పూజల అనంతరం స్వామి వారి లడ్డూ, పూజా సామగ్రిని వేలంవేశారు. అనంతరం నిర్వహించిన లక్కీ డ్రాలో పలువురు ఎలక్ట్రిక్ వాహనాలు, సైకిళ్లు గెలుచుకున్నారు. ఛత్రపతి యువసేన అధ్యక్షుడు శివంగారి సతీష్, సభ్యులు బాణాసంచా పేల్చారు. డప్పుచప్పుళ్లు, బ్యాండ్, మేళతాళాలతో గణపయ్య నిమజ్జనం చేశారు. ప్రజలు భారీగా తరలివచ్చారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌లు, ఎస్ఐలు బందోబస్తు ఏర్పాటు చేశారు. గణనాథుని నిమజ్జనం ఉన్నచోటనే ఫైరింజన్ల సాయంతో నిర్వహించారు.

వినాయకుడికి గొడుగు పట్టి

కలెక్టరేట్ ఆవరణలో గల వేంకటేశ్వర స్వామి ఆలయం కల్యాణ మండపం లోని వినాయకుడిని శనివారం నిమజ్జనం చేశారు. విగ్రహాన్ని వాహనంపైకి చేర్చగా ఎండవేడి అధికంగా ఉండడంతో ఒక భక్తుడు గణనాథుడికి గొడుగు పట్టుకుని నిల్చొన్నారు. అదనపు కలెక్టర్ డి వేణు కొబ్బరి కాయ కొట్టి శోభాయాత్రను నిర్వహించారు. కలెక్టరేట్ ఉద్యోగులు, భక్తులు పెద్దకల్వల చెరువు వద్దకు తీసుక వెళ్లి నిమజ్జనం చేశారు. టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.


నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడికి ఎండతో గొడుగు పట్టిన భక్తుడు

విజేతలకు బహుమతుల ప్రదానం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ శనివారం బహుమతులు ప్రదానం చేశారు. క్రీడాకారులు ఆటల వల్ల ఉన్నత స్థాయికి చేరుకుంటారని, చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని తెలిపారు. ఇందులో క్రీడాకారులు సింధు 100, 200 మీటర్ల రన్నింగ్‌లో బంగారు పతకం, అక్షిత 400 మీటర్ల రన్నింగ్‌లో బంగారు పతకం, శ్రీనాథ్ 200 మీటర్లలో బంగారు పతకం, లాస్యప్రియ, వరసిద్దు షార్ట్‌పుట్‌లో కాంస్య సాధించారు. ఈ క్రీడాకారులు ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే జోనల్ స్థాయి క్రీడల్లో పాల్గొం టారని తెలిపారు. విద్యార్థుల ఎంపికపై కరస్పాండెంట్ అల్లెంకి రజనిదేవి, ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్ కుమార్, మం జుల, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్

జక్కన్నపల్లిలో ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్

ధర్మారం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జక్కనపల్లిలో టీజీఎస్ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. జక్కన్నపల్లి ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నప్పటికి కొంత దూరంలో రాజరాంపల్లి గ్రామం ఉండడంతో జక్కన్నపల్లిలో ఆర్టీసీ బస్సులు ఆగడం లేదు. దీంతో ప్రజలు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. గ్రామ ప్రజలతో పాటు జక్కన్నపల్లిలో మినీ గిరిజన గురుకుల పాఠశాల ఉండడంతో ప్రజలు ఆయా ప్రాంతాలకు వస్తుంటారు. సమస్యను గ్రామస్థులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు శనివారం గ్రామంలో ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ బోర్డును ఏర్పాటు చేశారు.

మైక్రో బ్రూవరీల ఏర్పాటును విరమించుకోవాలి

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో మైక్రో బ్రూవరీల ఏర్పాటును విరమిం చుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్క పురి సూర్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశా రు. మైక్రో బ్రూవరీల ఏర్పాటును విరమిం చుకోవాలని లేకపోతే ఆందోళనలు చేస్తామన్నారు.

ఓటరు జాబితాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

మంథని/మంథనిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసం అధికారులు సమాయత్తమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో అధికారులు స్వల్పంగా మార్పులు చేశారు. మండలంలో 35 గ్రామ పంచాయతీలు, 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మొత్తం 38,690 మంది జనాభా ఉండగా వీరిలో 34,973 మందితో ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. వీరిలో నలుగురు ఇతరులు ఉన్నారు. ఓటర్ల జాబితాలో 17,040 మంది పురుషులు ఉండగా 17,929 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండలంలో 889 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు. 11 ఎంపీటీసీ స్థానాలకుగాను 67 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. కన్నాల ఎంపీటీసీ స్థానం లో ఉన్న రచ్చపల్లి సింగరేణి గని విస్తరణలో నిర్వాసిత గ్రామంగా తరలించారు. బిట్టుపల్లి పంచాయతీ పరిధిలో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటుతో ఈ గ్రామ పంచాయతీని సూరయ్యపల్లి ఎంపీటీసీ స్థానంలోకి మార్చారు. కన్నాల ఎంపీటీసీ స్థానంలో ఓటర్ల సంఖ్య తగ్గడంతో ఉప్పట్ల ఎంపీటీసీ పరిధిలో ఉన్న మల్లెపల్లి గ్రామ పంచాయతీని కన్నాలలోకి మార్చారు. నోటీస్ బోర్డు పై అంటించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా శనివారం మండల పరిషత్ భవనంలో ఎంపీడీవో శైలజారాణి ఆధ్వర్యంలో జెడ్పిటిసి, ఎంపిటిసిల ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను పబ్లికేషన్ చేశారు. ఓటరు జాబితాలో ఎవైనా అభ్యంతరాలు ఉన్నట్లైయితే ఈ నెల 8వ తేదిలోగా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఐఏఎస్ అధికారిని కలిసిన ఓబీసీ నాయకులు

ధర్మారం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరిని శనివారం మండల ఓబీసీ నాయకులు కలిశారు. స్వగ్రామం బసంత్‌నగర్‌కు రావడంతో ఓబీసీ నాయకులు కొత్త నర్సింహులు ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. గంధం మల్లయ్య, గాండ్ల స్వామి, ఆవుల మల్లయ్య, ఆకుల రాజేందర్, సాగంటి కొండయ్య, ఆవుల మల్లయ్య, ఆకుల స్వామి, పోలం ప్రసాద్, ఆకుల వీరస్వామి, బాలసాని చంద్రమౌళి, ఆశనవేణి రాజ్‌కుమర్ ఉన్నారు.



బ్యాలెట్ ఓటింగ్‌లో కార్మికులు పాల్గొనాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారంలో సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంపై కార్మికుల మనోభావాలను తెలిపేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాలెట్ ఓటింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఐటీ మాఫీ, మారు పేర్ల సమస్యలను పరిష్కరిస్తామని రెండేళ్ళు గడుస్తున్నా ఏ ఒక్కటి సాధించలేదన్నారు. కార్మిక వాడల్లో డ్రైనేజీ, మంచి నీటి సరఫరా, క్వార్టర్ల రిపేర్లు వంటి అనేక సమస్యలు పరిష్కారం అవడం లేదని, మెడికల్ బోర్డు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సర్ఫేస్ ఖాళీలు గతంలో మాదిరి భర్తీ చేయాలని, క్లరికల్ టెస్టు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈనెల 11, 12 తేదీల్లో సొంత ఇల్లు కావాలా, క్వార్టర్ కావాల అని బ్యాలెట్ ఓటింగ్‌లో కార్మికులు పాల్గొనాలని, 15న జీఎం ఆఫీస్‌ల ఎదుట చేపట్టనున్న ధర్నాకు రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, వెంకన్న, వినయ్, నరసింహ, శివకుమార్, తిరుపతి, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా కిషోర్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా సీహెచ్ కిషోర్ నియమితులయ్యారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈఏడాది జరగనున్న వార్షిక క్రీడా పోటీలకు కిషోర్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. కిషోర్ ఓసీపీ-3 ప్రాజెక్టులో డ్రిల్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఉద్యోగుల కృషి ఫలితంగానే ఫైవ్‌స్టార్ రేటింగ్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టు ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితంగా ఫైవ్‌స్టార్ రేటింగ్ లభించినట్టు ప్రాజెక్టు మేనేజర్ పాపయ్య అన్నారు. శనివారం ఆయన ఉద్యోగులను అభినందించారు. ప్రాజెక్టు ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు యంత్రాల అవాలబిలిటీ, సేఫ్టీ, పర్యావరణం వంటి అంశాల్లో ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమైనట్టు మేనేజర్ తెలిపారు. ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ తిరుపతిరావు, సేఫ్టీ ఆఫీసర్ అజయ్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ సాయి స్వరూప్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-1కు ఫైవ్ స్టార్ రేటింగ్ పురస్కారంలభించింది. శనివారం జీఎం కార్యాలయంలో ఉద్యోగులను జీఎం సుధాకర్‌రావు అభినందించారు. పురస్కారాన్ని ఈనెల 4న ముంబాయిలో జరిగిన కార్యక్ర మంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ఓసిపి-1 మేనేజర్ పాపయ్య అందుకున్నారు. ఈ పురస్కారాన్ని అధికారులు జీఎంకు అందజేశారు. ప్రాజెక్టు ఇంజనీర్ ఉదయ్ భాస్కర్, పర్యావరణ అధికారి కిషన్, సేఫ్టీ అధికారి అజయ్‌కుమార్, అధికారులు అశోక్‌కుమార్, రమేశ్, నజీర్ అహ్మద్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం సుధాకర్‌రావు


ఆర్జీ-2లో వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో యేటా నిర్వహించే ఇంటర్ డిపార్ట్‌మెంటల్ వార్షిక క్రీడలు శనివారం ఆర్జీ-2 ఏరియాలో ప్రారంభమయ్యాయి. అబ్దుల్ కలాం స్టేడియంలో వాలీబాల్ పోటీలను జీఎం బండి వెంకటయ్య ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం వాలీబాల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. జీఎం మాట్లాడారు. ఏసంస్థ అయినా ఆరోగ్యవంతులైన ఉద్యోగుల ద్వారా ప్రగతి సాధిస్తుందన్నారు. యువ ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నందున సీనియర్ క్రీడాకారులు వారిని క్రీడల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, అధికార ప్రతినిధి అరవిందరావు, అధికారులు మురళీకృష్ణ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాధన్, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేందర్‌రెడ్డితో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

వాస్తవ లాభాలు ప్రకటించాలి

గోదావరిఖని, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సర వాస్తవ లాభాలను ప్రకటించాలని, 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దసరా పండుగ 25రోజులు కూడా లేదని, వెంటనే లాభాలు ప్రకటించి కార్మికులకు పండుగ ముందే వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డుకు సంబంధించి గతంలో టీబీజీకేఎస్ గుర్తింపులో ఉన్నప్పుడు నెలకు రెండు మూడుసార్లు ఏర్పాటు చేశామని, కార్మికుల్లో 90శాతం మందికి అన్‌ఫిట్ చేశామని, ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆరోపించారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికుల పిల్లలకు సుటుబుల్ గ్రేడ్-3 క్లర్క్ ఇస్తున్న విధంగానే అన్‌ఫిట్, బయట ప్రమాదంలో చనిపోయిన వారి పిల్లలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి రవి, నాయకులు జావిద్‌పాషా, చెల్పూరి సతీష్, పాశం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకలపెల్లి శ్రీనివాస్, బొడ్డు రమేష్, రొడ్డ సంపత్, పల్లె సురేందర్, లక్ష్మణ్, రవీందర్, రహమాన్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపునకు యాప్

(5వ పేజీ తరువాయి)

తున్న ఇంటి వద్ద లబ్ధిదారుడితోపాటు ముందు వైపు నుంచి, పక్క నుంచి, పైనుంచి (టాప్ యాంగిల్) ఫొటోలు తీయాలి. ఈ ఫొటోలు గ్రౌండింగ్ సమయంలో తీసిన ప్రాంతం సమీపం నుంచే తీయాలి. యాప్ అడి గిన సమాచారాన్ని నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. ఇదే తరహాలో వాలింగ్ దశలోనూ, స్లాబ్ దశలోనూ, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఫొటోలు తీసి లబ్ధిదారులే నేరుగా బిల్లుల కోసం అప్‌లోడ్ చేయొచ్చు.

- గ్రామ కార్యదర్శులు, ఎంపీడీఓలు, డీఈఈలు పీడీ, తదితర అధికారులు, ఈ విధంగా నమోదైన వివరాలను క్షేత్ర స్థాయిలో సరిచూసుకున్న తర్వాతనే లబ్ధిదారులకు బిల్లులు విడుదల చేస్తారు.

ఎంపీడీవో కార్యాలయంలో సీఈవో తనిఖీ


మాట్లాడుతున్న సీఈవో రవీందర్

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం సీఈవో నరేందర్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని హాజరు, ఇతర రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి చేస్తున్న పనులపై ఎంపీడీవో పూర్ణచందర్‌ను తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల సమస్యలను ఎప్పటికప్పుడు కార్యదర్శులు పరిశీలించి, పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో పూర్ణచందర్, ఎంపీవో ఆరీఫ్, పర్యవేక్షకులు శ్రీధర్, రంగు రవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు


బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

ముత్తారం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. ఖమ్మంపల్లిలో ప్రభుత్వ భూమి 617 సర్వే నంబరులో కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంపల్లి గ్రామానికి చెందినవారు ఫిర్యాదు చేశారని, ఆ భూమిలో శనివారం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు సిబ్బందితో కలిసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

కమాన్‌పూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్రామస్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అన్వర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను చిన్న చూపు చూసిందని, తమ ప్రభుత్వం ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయిస్తున్నదని తెలిపారు. అన్ని వర్గాల మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ధనలక్ష్మి, మండల కోఆర్డినేటర్ కుమ్మరి సవిత, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, తహసీల్దార్ వాసంతి, ఎంపీడీఓ లలిత, కాంగ్రెస్ నాయకులు రంగు సత్యనారాయణ, ఇనగంటి రామారావు, కిషన్ రెడ్డి, అంబీర్ శ్రీనివాస్, ఇక్బాల్, ముస్తాక్, రఫీక్, మల్యాల మహేష్, నగునూరి నర్సయ్య, ఇనగంటి ప్రభాకర్ రావు, చాట్ల గట్టయ్య, గఫార్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి కుటుంబానికి చేయూత

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పాలకాని కనకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పలవురు చేయూతనందించారు. శనివారం తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ తోపాటు పలువురు ఉద్యమకారులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.6500 ఆర్థిక సహాయం అందించారు. ఉద్యమకారులు జనగామ రవి, కోడూరి రాజీరు, రాజేశం, చంద్రకళ, బత్తుల శంకర్, ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, అశోక్, సిలువేరు సుధాకర్, కుమారస్వామి, కొంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు

కమాన్‌పూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. శనివారం గుండారంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌పై కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్నారు. మాజీ జడ్పీటీసీ మేకల సంపత్ యాదవ్, మాజీ ఎంపీపీ రాచకొండ లక్ష్మీరవి, వైస్‌ఎంపీపీలు ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, కొట్టె భూమయ్య, గ్రామశాఖ మండల అధ్యక్షుడు దండే కిషన్, మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గర్రం లక్ష్మీమల్లు, మాజీ ఎంపీటీసీ గాదె అనురాధ సదయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు పోలుదాసరి సాయికుమార్, జాబు సతీష్, నాయకులు తోట వీరయ్య, బోయిని బాలకృష్ణ, రాచకొండ చంద్రమౌళి, బొల్లపల్లి శంకర్ గౌడ్, తోట రాజ్ కుమార్, ఠాగూర్ పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి

కమాన్‌పూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో మండల కేంద్రంలో గ్రంథాలయ భవనానికి కృషి చేస్తానని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అన్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయ నిర్వాహకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు సత్యనారాయణ, రామారావు, కిషన్ రెడ్డి, ఇక్బాల్, అంబీరు శ్రీనివాస్, అబ్దుల్ రఫీక్, గట్టయ్య, ముస్తాక్, శంకర్, మల్యాల మహేష్, నర్సాగౌడ్, రవి, గడ్డం ప్రకాష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కమాన్‌పూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదివరాహస్వామి ఆలయానికి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఆలయ ఈఓ కాంతారెడ్డి పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజనీర్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. శనివారం దర్శనానికి వచ్చిన ఆయనను కలిశారు. రూ.40 లక్షల నిధులు విడుదల చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఎస్టిమెట్ వేయాలని ఎస్ఈ చక్రవర్తి, ఈఈ గిరీష్, ఏఈ జగదీష్‌ను ఆదేశించారు. నాయకులు లల్లు, బొజ్జ సతీష్, నల్లవెల్లి శంకర్, చింతపండు మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చికిత్స పొందుతున్న రమేష్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయం పూర్వ విద్యార్థి తిప్పాని తిరుపతికి శనివారం పాఠశాల డైరెక్టర్ విక్రమ్‌వర్మ, ఉపాధ్యాయులు రూ.6500ఆర్థిక సహాయం అందజేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లడ్డు, కలశం వేలం వేయగా వచ్చిన డబ్బులను తిరుపతికి అందజేశారు. నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్, అమ్మ రాజు, టీచర్లు పాల్గొన్నారు.